

మంద మురళీధర్‌ను సత్కరిస్తున్న గోపిశెట్టి నిరంజన్, రియాజ్ తదితరులు

ప్రతి ఒక్కరికీ అండగా భారత రాజ్యాంగం

హైదరాబాద్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ మురళీధర్

రాంనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి భారత రాజ్యాంగం అండగా ఉందని హైదరాబాద్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ మంద మురళీధర్ అన్నారు. ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగం చదవాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా న్యాయ సేవారత్న అవార్డుల ప్రదానం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం చదివితే న్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ మంద మురళీధర్, బీసీ కమిషన్ ఛైర్మన్ గోపిశెట్టి నిరంజన్, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ రియాజ్, టీజీఐఐసీ ఛైర్మన్ టి.నిర్మల జగ్గారెడ్డి తదితరులు న్యాయ సేవా రత్న అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లపు దుర్గారావు, కీర్తి యుగేందర్, ప్రవీణ్‌కుమార్, వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం సజీవ గ్రంథం : ఎంపీ లక్ష్మణ్



ఫొటో ప్రదర్శన తిలకిస్తున్న ఎంపీ లక్ష్మణ్

రాంనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమతుల్య హక్కులు, విధుల ద్వారా రాజ్యాంగం సమానత్వాన్ని నిర్ధారిస్తుందని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని నారాయణగూడ కేశవ మెమోరియల్ విద్యాసంస్థల్లో సీబీసీ ఫొటో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఫొటో ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని సజీవ గ్రంథంగా ఆయన అభివర్ణించారు. కార్యక్రమంలో పీఐబీ సీబీసీల అడిషనల్ డైరెక్టర్ జనరల్ శృతిపాటిల్ పాల్గొన్నారు. ప్రదర్శనలో రాజ్యాంగ పరిణామాన్ని ప్రతిబింబించే 33 ఫొటో ప్యానెల్స్‌తోపాటు వందేమాతరం 150 ఏళ్ల సందర్భాన్ని గుర్తు చేసే అరుదైన చిత్రాలతో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు.



ప్రముఖ గాయకుడు రవిబాబును సన్మానిస్తున్న జనార్దనమూర్తి, అంజనీకుమారి, టి.రామోజీ

తెలుగుజాతి గర్వించదగ్గ గాయని పి.సుశీల


చిక్కడపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి గర్వించదగ్గ గాయని సుశీల అని త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, సిటీ సివిల్ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ అంజనీకుమారి అన్నారు. బాలాజీ ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫౌండేషన్ గ్లోబల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ప్రఖ్యాత గాయని పి.సుశీలకు 90వ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ గానసభలో తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి సంస్థ నిర్వాహకులు, ప్రముఖ గాయకులు టి.రామోజీ పర్యవేక్షణలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రముఖ గాయకులు ఆర్.రవిబాబును సన్మానించిన జనార్దనమూర్తి, అంజనీకుమారి మాట్లాడుతూ సుశీలకు జన్మదిన శుభాకాంక్షలు చెప్తూ ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గాయనీగాయకులు రామోజీ, రవిబాబు, వెంకట్రావు, శ్యామ్‌బాబు, వెంకటేష్, ప్రసాదరావు, సుబ్రహ్మణ్యం, వాసు, సాయి అవినాష్, మధురవీణ, ప్రణీత, భారతిదేవి, అనురాధ, సీత, సరిత, భాగ్యలక్ష్మి, జ్యోతి.. సుశీల, ఘంటసాల, ఎస్‌పి బాలు గీతాలను ఆలపించారు.



అధికారులతో కలిసి వీడీసీసీ రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

శరవేగంగా రోడ్ల నిర్మాణం : కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని పలు చోట్ల నూతన రోడ్ల నిర్మాణం, ప్యాచ్‌వర్క్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని ముషీరాబాద్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ పక్కనున్న వీధిలో రోడ్డుపై గుంతలు పడి పాదచారులకు ఇబ్బందికరంగామారింది. ఈ క్రమంలో బుధవారం ఆమె పనులను జీహెచ్ఎంసీ ఏఈ అబ్దుల్‌సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌లతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 50 మీటర్ల వెడల్పు వీడీసీసీ రోడ్డుపనులు, ప్యాచ్‌వర్క్ పనులు జరుగుతున్నాయని త్వరలోనే పనులు పూర్తవుతాయని కార్పొరేటర్ వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, నాయకులు నవీన్‌కుమార్, రత్నసాయిచంద్ తదితరులు పాల్గొన్నారు.



పడిపూజ

గోల్నాక డివిజన్ శంకర్‌నగర్‌లో అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమంలో కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్, రజిని సాయిచంద్, దూసరి శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్‌గౌడ్ గురుస్వామి, వెంకటేష్‌గౌడ్ గురుస్వామి, తదితరులు

- (గోల్నాక, ఆంధ్రజ్యోతి)



ఆశీర్వాదం

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో శాసనసభ్యుడిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ పూలబొకే అందజేసి ఆశీర్వదించిన మాజీ ఎంపీ వి.హనుమంతరావు, తదితరులు - రాంనగర్, ఆంధ్రజ్యోతి



లోయర్‌ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్ల మూరి కృష్ణ స్వరూప్



కవాడిగూడలో విడి కృష్ణ, మద్దెల ప్రభాకర్, పోతరాజు భాస్కర్ తదితరులు



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ, ఉద్యోగులు, నిరుద్యోగులు

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఘన నివాళులర్పించిన నేతలు

కవాడిగూడ , నల్లకుంట, చిక్కడపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి దళిత బహుజన పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు.. సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు వీఎల్ రాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు రోజా లీలా, రాష్ట్ర అధ్యక్షుడు జేఎన్ రావు, పార్టీ నేతలు గణేష్, హ్యూమన్ రైట్స్ కాన్ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాజేందర్, మోహన్‌రావు, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, రాష్ట్ర నాయకులు పాల్గొని విగ్రహానికి నివాళులు అర్పించారు. కవాడిగూడలోని మోతీలాల్ నెహ్రూనగర్‌లో వేడుకలు నిర్వహించారు. చిక్కడపల్లిలోని సిటీ సెంట్రల్ లైబ్రరీలో నగర కేంద్రగ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అలాగే నల్లకుంట డివిజన్ సత్యానగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి సత్యానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు, ప్రముఖ సీనియర్ న్యాయవాది మహేందర్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఆమ్‌ఆద్మీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్




సత్యానగర్ బస్తీలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



నల్లకుంటలో రాజ్యాంగ ప్రతిని చూపిస్తున్న సీనియర్ న్యాయవాది

ఆధ్యాత్మిక చింతనతోనే శాంతి : ఎమ్మెల్యే కాలేరు



టీఆర్‌టీ కాలనీలో శ్రీదుర్గామాత ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన



శ్రీదుర్గామాత ఆలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దంపతులు, కార్పొరేటర్ యాకర అమృత తదితరులు

నల్లకుంట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాంత్రిక జీవితంలో మానసిక ఒత్తిళ్లకు గురవుతున్న వారిలో భక్తి భావం, ఆధ్యాత్మిక చింతనతోనే శాంతి నెలకొంటుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం నల్లకుంట డివిజన్ టీఆర్‌టీ కాలనీలో శ్రీదుర్గామాత ఆలయంలో అమ్మవారి మూలమూర్తి గర్భాలయంలో నాలుగు అడుగుల అలంకారమూర్తి ప్రతిష్ఠాపన మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారి యంత్రస్థాపన, విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠాపన అనంతరం సాయంత్రం పురవీధుల్లో పెద్దఎత్తున మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే కాలేరు, ఆయన సతీమణి, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ, నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృతలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నల్లా నరేష్‌కుమార్, లావణ్య, మూలవిరాట్ విగ్రహదాత నితిన్‌కుమార్, నవ్యత, నికిలేష్‌బాబు, నేతికా తదితరులు పాల్గొన్నారు.

లింక్‌బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలి : కార్పొరేటర్ రచనశ్రీ



సూరజ్‌నగర్‌లో లింక్‌బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ, బస్తీవాసులు

కవాడిగూడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దోమలగూడ అశోక్‌నగర్‌లను కలుపుతూ నిర్మించిన లింక్‌బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి త్వరలోనే వినియోగంలోకి తీసుకువచ్చేలా వివిధ శాఖల అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ అన్నారు. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న లింక్ బ్రిడ్జి నిర్మాణాన్ని 15రోజులలోపు పూర్తి చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. బుధవారం లింక్ బ్రిడ్జి పనులను ఆమె వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సూరజ్‌నగర్ బస్తీ వాసులు మాట్లాడుతూ, తమ బస్తీలో డ్రైనేజీ పైప్‌లైన్లు వేశారని, అదేవిధంగా మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని, లింక్‌బ్రిడ్జినుంచి బస్తీకి ర్యాంపు ఏర్పాటు చేసి బస్తీవాసుల సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. కార్పొరేటర్ రచనశ్రీ మాట్లాడుతూ, లింక్ బ్రిడ్జి నిర్మాణం వల్ల సూరజ్‌నగర్ బస్తీవాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. బస్తీ వాసుల కోసం డ్రైనేజీ పైప్‌లైన్, మంచినీటి పైప్‌లైన్ వేయాలని వాటర్‌వర్క్స్ అధికారులకు ఆమె సూచించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కాకుండా వెంటనే ర్యాంపు ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. ఎలాంటి ఇబ్బందులు వచ్చినా బస్తీ వాసుల పక్షాన బీజేపీ పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ సుప్రజ, ప్రాజెక్ట్ ఏఈ ప్రశాంత్, జీహెచ్ఎంసీ ఏఈ వినోద్, బీజేపీ రాష్ట్ర నాయకుడు వెంకటేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆ స్థలం బస్తీ కమిటీదే..

తిరిగి అప్పగించాలి.. బండమైసమ్మనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు



విలేకరులతో మాట్లాడుతున్న బండమైసమ్మ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కవాడిగూడ నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ బండమైసమ్మనగర్‌లో సాయిరాం హైస్కూల్ నిర్వాహకులు బస్తీకమిటీ సభ్యులకు తెలియకుండా రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆ స్థలాన్ని తిరిగి బస్తీ కమిటీకి అప్పగించాలని బండమైసమ్మనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం బండమైసమ్మనగర్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ జాయింట్ సెక్రటరి వెంకటస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి సునిల్‌కుమార్, కమిటీ సభ్యులు రామరత్నం, రాజేంద్రకుమార్, మార్కండేయ, గుమ్మడి కృష్ణ, శ్రీనివాస్, సంతోష్ మాట్లాడారు. ప్రస్తుతం పాఠశాల కొనసాగుతున్న స్థలాన్ని స్థల యజమాని వజీర్ అలీ 1996లో బండమైసమ్మనగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు గిఫ్ట్‌డీడ్‌గా ఇచ్చారని తెలిపారు. అంతకు ముందు నుంచి అక్కడ కొనసాగుతున్న పాఠశాల యాజమాన్యం 2011లో 522 గజాల ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. దీనిని కమిటీ అభ్యంతరం వ్యక్తం చేసిందని తెలిపారు. 1996లో స్థల యజమాని వజీర్ అలీ బస్తీ కమిటీ అధ్యక్షుడిగా హరినాథ్, ప్రధాన కార్యదర్శిగా వెంకన్న, సలహాదారులుగా గుమ్మడి ఎల్లయ్య తదితర బస్తీ కమిటీ సభ్యు ల సమక్షంలో అసోసియేషన్‌కు గిఫ్ట్ డీడ్ చేసినట్లు వారు తెలిపారు. ఈ విషయంపై అధికారులు సమగ్ర విచారణ జరిపి బండమైసమ్మనగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు తిరిగి పాఠశాల స్థలాన్ని అప్పగించేలా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో తమకు న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తామని బస్తీ కమిటీ నాయకులు హెచ్చరించారు.

ముషీరాబాద్ చేపల మార్కెట్ రోడ్డును ఆధునికీకరించాలి

ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూస గోరఖ్‌నాథ్



ముషీరాబాద్ చేపల మార్కెట్ రోడ్డును పరిశీలిస్తున్న పూస గోరఖ్‌నాథ్

ముషీరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోనే అతి పెద్దదైన ముషీరాబాద్ చేపల మార్కెట్ రోడ్డు అధ్వానంగా మారిందని ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూస గోరఖ్ అన్నారు. ఈ రోడ్డును ఆధునికీకరించి ప్రజలు ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం ముషీరాబాద్ చేపల మార్కెట్‌లో అధ్వానంగా మారిన రోడ్డును ఆయన పరిశీలించి మాట్లాడారు. సంవత్సరం కాలంగా మార్కెట్‌లో అధ్వానంగా మారిన రోడ్డు వల్ల వ్యాపారులు, కొనుగోలు దారులు, స్థానికంగా నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

జీహెచ్ఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పూస గోరఖ్ ఆరోపించారు. స్థానిక సమస్యలను ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్, నానీ, సూరి, రాము, రమేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలు కాపాడాలి : రాచకొండ సీపీ



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, అనుభవిస్తూ బాధ్యతలను పాటిస్తూ సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలను ప్రతి ఒక్కరూ కాపాడాలని రాచకొండ సీపీ జి.సుధీర్‌బాబు సూచించారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నేరేడ్‌మెట్ కమిషనరేట్‌లో 'సంవిధాన్ దివస్'ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీ సుధీర్‌బాబు రాజ్యాంగ ప్రవేశిక చదివి వినిపించడంతో పాటు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాజ్యాంగం దేశానికి మార్గదర్శనం చేస్తుందని, ప్రతి పౌరుడు దాని స్ఫూర్తిని కాపాడే బాధ్యత వహించాలని సూచించారు.

రాజ్యాంగాన్ని ఆమోదించిన నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవంగా నిర్వహించుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ డీసీపీ జి.నరసింహారెడ్డి, అడ్మిన్ డీసీపీ ఇందిర, అడిషనల్ డీసీపీ శివకుమార్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన ప్రభుత్వ ఉద్యోగికి 25 ఏళ్ల జైలు

బర్కత్‌పుర, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అభం, శుభం తెలియని చిన్నారిపై అత్యాచారానికి ఒడిగట్టిన ప్రభుత్వ ఉద్యోగికి న్యాయస్థానం 25 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించింది. కాచిగూడ పీఎస్ సీఐ జ్యోత్స్న వివరాల ప్రకారం.. భర్త చనిపోవడంతో బాధిత చిన్నారి తల్లి కాచిగూడలోని ఆమె బంధువు మహేందర్‌కౌర్ ఇంట్లో కొన్ని రోజులు ఉండి బయట పనిచేస్తుండేది. 2024 మేలో చిన్న వివాదం కారణంగా ఆమె అద్దె ఇంట్లోకి మారింది. రెండేళ్ల కుమార్తెను బంధువుల ఇంట్లో వదిలి పనికి వెళ్లేది. ఒకరోజు బాలికకు రక్తస్రావం కావడంతో అనుమానం వచ్చిన తల్లి ఆస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యులు పరీక్షించి లైంగిక దాడి జరిగినట్లు తెలిపారు. పాపను బంధువుల ఇంట్లో వదిలి వెళ్లినప్పుడే ఈ ఘటన జరిగిందని పాప తల్లి అప్పుడు కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి ఇంటి యజమాని.. ప్రభుత్వ ఉద్యోగి సర్దార్ త్రిలోక్‌సింగ్ (50) ఈ దారుణానికి ఒడిగట్టినట్లు గుర్తించి అతనిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం ఈ కేసు తుది తీర్పువెలువడింది. నాంపల్లి 12వ అదనపు సెషన్స్ జడ్జి నిందితుడు త్రిలోక్‌సింగ్‌కు 25 ఏళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలలు శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన కానిస్టేబుల్ శ్రీనివాస్, సూరజ్‌లను ఈస్ట్‌జోన్ డీసీపీ డా.బాలస్వామి అభినందించారు.

రైల్వే టీటీపై ప్రయాణికుల దాడి.. కేసు నమోదు

బర్కత్‌పుర, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైల్వే టీటీపై ప్రయాణికులు దాడి చేయడంతో కేసు నమోదు చేశారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం.. నీరజ్‌కుమార్‌సింగ్ రైల్వే టీటీగా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం భగత్‌కికోటి ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడ నుంచి నాందేడ్ వరకు డ్యూటీలో వెళ్లారు. నిజామాబాద్‌కు చెందిన తల్లి, కుమార్తె జనరల్ టికెట్ తీసుకుని ఎస్-5 బోగీలో ఎక్కారు. రిజర్వేషన్ బోగీలో ఎందుకు ఎక్కారని టీటీ ప్రశ్నించడంతో వారు గొడవ పడి.. ఆ మహిళ విషయాన్ని భర్తకు ఫోన్ చేసి చెప్పింది. నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలు ఆగగానే భర్తతో పాటు మహిళ, కుమార్తె టీటీపై దాడి చేశారు. నీరజ్‌కుమార్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ-1 పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. మారుతీనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని శ్రీనివాసా టీఎఫ్ ఏరియా, హనుమాన్‌టెంపుల్, ట్రాఫిక్ పీఎస్, రాజ్‌నగర్, మహాభారత్‌నగర్, శ్రీనివాస్‌నగర్, బీజేఆర్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ముగిసిన సుబ్రహ్మణ్య షష్టి పూజలు

చిక్కడపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్ శ్రీ లక్ష్మీగణపతి దేవాలయం ఆవరణలోని శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారి మందిరంలో షష్టిపూజల కార్యక్రమం ముగిసింది. శ్రీ సుబ్రహ్మణ్యషష్టి పర్వదినం సందర్భంగా బుధవారం ఉదయం 6 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు అభిషేకాలు, సాయంత్రం 5నుంచి 8 వరకు స్వర్ణపుష్పార్చనలు ఈవో లక్ష్మారెడ్డి, ఛైర్మన్ ఎం. నర్సింగ్‌రావు పర్యవేక్షణలో నిర్వహించారు.

అంధకారంలో అరుంధతినగర్ బస్తీ

చిక్కడపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ అరుంధతి నగర్ బస్తీవద్ద అంధకారం నెలకొంది. దీంతో రాత్రిపూట వాహనదారులకు, పాదచారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతుంది. ముఖ్యంగా బస్తీఎదురుగా ఉన్న హనుమాన్ దేవాలయం వద్ద స్ట్రీట్‌లైట్ వెలగకపోవడంతో ఆ వీధి మొత్తం అంధకారంగా మారింది. అధికారులు స్పందించి ఆలయం వద్ద స్ట్రీట్‌లైట్ ఏర్పాటు చేయించాలని బస్తీఅధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు.



రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలని ప్రతిజ్ఞ చేస్తున్న అవాజ్ రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్, టీపీఎస్‌కే రాష్ట్ర కన్వీనర్ రాములు, తదితరులు

- రాంనగర్, ఆంధ్రజ్యోతి



ఆదర్శ వివాహం

కేవీపీఎస్ ఆధ్వర్యంలో బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అక్షర, నరేష్‌ల ఆదర్శ వివాహం నిర్వహించారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు తదితరులు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి



సత్కారం

ఖైరతాబాద్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన మోతే రోహిత్ ముదిరాజ్‌ను ఆయన నివాసంలో శాలువాతో సత్కరించి బోకేను అందజేస్తున్న గోల్నాక డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తిరునగర్ రఘురాం.

- (గోల్నాక, ఆంధ్రజ్యోతి)